# అమ్మన్నపెళ్ళిప్రయత్నం

[కథానిక]

= శ్రీ 'జమదగ్ని' =

✿

లోకంలో కొందరు ఇతర్లకు నొప్పి కలగకుండా ప్రవర్తించాలనే ఉద్దేశ్యంతో పిరికితనం పెంచుకుంటారు. నరసింహారావు అల్లాంటి భయస్థుల్లో ఒకడు. పెళ్లాం కాపురానికి వచ్చినదగ్గఱనుంచీ ప్రతియేడూ కాకపోయినా రెండేళ్ల కొకమాఱైనా మూణ్నెల్లు స్వయంపాకం చేసుకుంటూ అరడజనుకు పైగా సంతానం కని సంసారసారం బాగా అనుభవిస్తున్నవాడు. చేసే బడిపంతులుద్యోగం ఇచ్చే చాలీచాలని జీతంతో వెనక ఆసరాగా మడిమాన్యాలు లేకపోయినా ఆలుమగలు సంసారాన్ని తెలివితేటలుగానే నెట్టుకొస్తున్నారు.

అయితే వారికీమధ్య ఒక పెద్ద ఇడద వచ్చిపడింది. మొట్టమొదటి సంతానం ఆడపిల్ల కావడంచేత దానికి పెళ్లియీడు వచ్చింది. ఆడపిల్లల పెళ్లిళ్ల విషయంలో సాధారణంగా ఆడవాళ్ల కున్నంత తొందఱ మగవాళ్లకుండదు. పిల్లకు పన్నెండేళ్లు వచ్చినదగ్గఱనుంచీ అంటూ సొంటూ లేని ఇరుగమ్మా పొరుగమ్మా మాటిమాటికీ పిల్లపెళ్లివిషయం అడుగుతూఉండడంచేత ఈ తొందఱ మఱీ ఎక్కువౌతుంది. నరసింహారావు భార్య అసలే కంగారుమనిషి కావడంవల్ల ఏడాదిబట్టీ పిల్లపెళ్లివిషయం రోజూరోజూ జ్ఞాపకంచేస్తూ కాలు నేలమీద నిలుపకుండా భర్తమీద గంతులేస్తోంది.

ఆరోజు సెలవురోజు కావడంచేత ఇంటాయనకు బడితొందఱా, ఇంటావిడకు వంటతొందఱా లేక పొద్దెక్కి నిద్రలేచారు. లేస్తూనే 'అమ్మాయిపెళ్లిమాట ఏమాలోచించారండీ?' అంటూ అతనివంక నిశితంగా చూస్తూ ప్రశ్న వేసిం దాయిల్లాలు. నిద్రబద్ధకంచేత కళ్లు తెఱవకపోయినా ఆవిడప్రశ్నలోని గాంభీర్యానికి మనస్సు తెఱవక తప్పిందికాదు నరసింహారావుకు. మత్తుకళ్లు నులుముకుంటూనే మంచంమీద లేచికూర్చుని 'ఏం చెయ్యమంటావ్? రాత్రంతా నిద్రపడితేగా! అదే ఆలోచన!' అన్నాడు యాదాలాపంగా. 'మీరిలా ఆలోచిస్తూనే ఉంటారు. ఈడొచ్చిన పిల్లని యింట్లో పెట్టుకుని ఎన్నాళ్లిట్లా ఉండగలమండీ? నేను నెత్తిన నోరెట్టుకు వాగుతున్నా మీరేమో బొత్తిగా పట్టించుకోరు. సంసారం అంటే ఇంత శ్రద్ధ లేనివాళ్లకు పెద్దవాళ్లు పెళ్లిళ్లెందుకు చేస్తారో అర్థంకాదు' అంటూ చీదరించుకుని, కప్పుకున్న దుప్పటి పక్కమీదినుంచి కిందికి తోసిపారేస్తూ చివాలున లేచి ఆవిడ పడమటింటిలోకి వెళ్లిపోయింది.

ఈ దూకుడుకు మంచం అదిరి నిద్రపోతూఉన్న ఆఱునెల్ల పిల్లవాడులిక్కిపడి కెవ్వుమనగా వాణ్ని బుజాన వేసుకుని ఆడిస్తూ నరసింహారావు వీధివసారాలో పడకకుర్చీలో నడుంవాల్చాడు. ఇంతలో పెళ్లికూతురు మొహం కడుక్కోడానికి నీళ్లూ వగైరా తెచ్చియిచ్చి పిల్లవాణ్నెత్తుకుని లోపలికి వెళ్లిపోయింది. నరసింహారావు ముఖప్రక్షాళనాదికం కానిచ్చి పడకకుర్చీలో కూర్చున్నాడో లేదో పొగలుగక్కుతున్న కాఫీకప్పుతోపాటు ఆనందసూచకమైన ముఖంతో ఇంటావిడ ప్రత్యక్షమయింది. అతని కెదురుగా వున్న కుర్చీలో కూర్చొని కాఫీ చల్లారపోస్తూ 'ఇవ్వాళ కాఫీ ఎవరు కాచారో ఎరుగుదురటండీ! మన మాలస్యంగా లేచామని అమ్మాయి డికాక్షను తయారుచేసి పాలు కుంపటిమీద పెట్టివుంచింది. దాని పనిపాటలు చూస్తే దానికి తొందఱగా పెళ్లిచేసి, చిలకాగోరింకల్లా అదీ దాని

మొగుడూ కాపురంచేస్తూఉంటే చూడాలని అనిపిస్తుంది. మీకు ముద్దూ లేదు ముచ్చటాలేదు.' అంటూ కాఫీ అందించింది. కాఫీ అందుకుని చప్పరిస్తూనే ఇవ్వాళ రోజల్లా ఎట్లా గడుస్తుందా అని ఆలోచిస్తున్నాడు. ఇంతలోనే ఆవిడ 'ఒక్కదానికీ సమాధానం చెప్పరేమిటండీ! మొన్న ఈవూళ్లో పొక్కనూరివారి అబ్బాయిమాట కనుక్కుంటా నంటిరి! వాళ్లేమన్నారేమిటి?' అన్నది.

'వాళ్లకు మూడువేల రూ॥పాయలు కట్నం కావాలిట. పైగా లాంఛనాలట! అంతఎత్తు సంబంధం మన మెక్కడ చెయ్యగలం!' అంటూ విసుక్కున్నాడు నరసింహారావు.

'సరే! బాగానే ఉన్నది. ఇంత మాత్రానికే విసుక్కుంటే లాభ మేమిటండీ? ఇక వాళ్లేనా ఏమిటి ప్రపంచంలో? మనం శ్రద్ధచెయ్యాలేగాని మన ఎత్తుకు తగినవాళ్లు మనకి దొరక్కపోరు. పోనీ! ఆ వెంకట్రామయ్యగారి రెండోవాడి మాట కనుక్కున్నారా?'

'వాళ్లుమాత్రం తక్కువతిన్నారా ఏమిటి? ఆ కుఱ్ఱాడు స్కూలుఫైనలుపరీక్ష మూడోయేడుకూడా ఎగిరితన్నాడు. ఆస్తి చూస్తే నలుగు రన్నదమ్ములూ పంచుకుంటే తలో మూడెకరాలన్నా రాదు. అయినా కట్నంమాత్రం వెయ్యిన్నూటపదహార్లు తప్పదట.'

'వెయ్యిరూపాయిలన్నా కట్న మివ్వకుండా పిల్లపెళ్లి చేద్దామనేగావున్ను మీఉద్దేశ్యం. ఈ మగపిల్లల గిరాకీరోజుల్లో అ దెట్లాగూ సాగదుకానీండి, ఆ నూరివారు పెంచుకున్నవాడి మాట ఏంచేశారు?'

'వాళ్లనైతే నేను కనుక్కోలేదు కాని అసలు నాకు దత్తపుత్రులంటే గిట్టదు. ఆస్తివిలువ తెలియక మైనారిటీవెళ్లిన మర్నాడు మసిజేసిపారేస్తారు. ఆస్తి ఉన్నదిగదా అని అక్షరంముక్క నేర్చుకోరు.'

'అందుబాట్లో ఉన్నవాటి కిట్లా వంకలుపెడ్తూ కూర్చోండి. లేని వెట్లాగూ లేవు. ఆయనకు మీరంటే ఎంతో గౌరవం. మీరు పిల్ల నిస్తామంటే చాలు తప్పకుండా చేసుకుంటారు. లోకంలో పెంపుడుకొడుకులంతా మీరన్నట్లే కావాలని ఉన్నదా ఏమిటి? అయినా ఆ అబ్బాయి ఏ ఫోర్తుఫారమో చదువుతున్నాడుటగా?'

'ఏమో ఏం చదువుతున్నాడో! అయినా వాడికి వాడప్పకూతుర్నే ఇస్తారుటలే.'

'అదీ ఉత్తదే అయిందీ! సరే కానీండి, నాకు తెలియకడుగుతాను, మీ రెంతసేపూ ఈవూళ్లో గిరిగీసుకు కూర్చుంటే ఎట్లా చెప్పండి? ఉన్న ఊళ్లోనే సంబంధం కావాలంటే దొరుకుతుందా! మీరేమో ఇంట్లోనుంచి బైటికి కాలు కదపరాయెను. సంబంధాలు మన కాళ్లదగ్గఱకు రావాలంటే ఎట్లా వస్తాయి? మన మేమన్నా మగపెళ్లివారమా ఏమిటి? ఆడపిల్లపెళ్లి చెయ్యాలే అన్న తహతహ మన కుండి మనం తిరగాలి గాని.'

'అదిగో! అట్లా మాట్లాడితేనే నాకు కోపం వస్తుంది. నా కామాత్రం బాధ్యత తెలియనట్లూ, నేనేమీ చెయ్యనట్టూ మాట్లాడతావేమిటి? నామీద నీ కామాత్రం నమ్మకం లేకపోతే మహా ఆడపిల్లల్ని కన్నదానివీ, బాధ్యత తెలిసిందానివీ నువ్వే పోయి ఏదన్నా సంబంధం వెతుక్కురా! మాఱుమాటాడకుండా నువ్వు చెప్పినవాటన్నింటికీ ఒప్పుకుని పిల్లపెళ్లి చేసేస్తాను.'

'ఇంతసేపూ నే చెప్పినదానికి దేనా ఫలితం? ఏకొంచెం అన్నా మూతి మూ రెడు చేసుకోడం ఒకటి చేతవును! నా కేదో కావాలని నే నడిగినట్లు కస్సుబుస్సు మంటారేమిటండీ!'

'కాకపోతే ఏం చెయ్యమంటావ్! మొన్నమటుకు మొన్న మూడురోజులు సెలవులు వస్తే గుడివాడ అంతా గాలించి వచ్చాను కదా! ఒక్కచోటా అనుకూలమైంది తటస్థపడకపోయె! పోనీ ఒక నెలరోజులు సెలవుపెట్టి అన్నివూళ్లూ తిరిగివద్దామా అంటే ఆ స్కూలువాళ్లు ఇచ్చి చావరాయె. జీతం వదులుకుపోతానన్నా పని కిబ్బందవుతుందని హెడ్మాష్టరు వదలడంలేదు.'

'ఏమిటో మీమతం మీది. వీలులేదనుకుంటే లేనట్టే కనపడుతుంది. ఉందనుకుంటే ఉంటుంది. ఆ

రాజగోపాలంగారు చూడరాదూ. గవర్నమెంటిలాకా తాలూకాగుమాస్తాపని చేస్తూ తన ఇద్దఱి పిల్లలకూ చక్కని సంబంధాలు కుదుర్చుకొచ్చారు. రేపు వైశాఖ మాసంలో ఇద్దఱి పెళ్లిళ్లూ ఒక్కసారే చేసేస్తారుట!'

'ఆయనకేం ఆయన మహారాజు. తను చిన్న ఉద్యోగం చేస్తున్నా బంధువులందఱూ పెద్ద పెద్ద ఉద్యోగాల్లో ఉన్నారు. ఎవరికి ఒక కార్డు వ్రాసినా సంబంధాలు వెదికి కుదిర్చిపెడ్తారు. మూడుకానుల ఖర్చుతో ముప్పైవూళ్ల సమాచారాలు తెలుసుకోగలడాయన. పైగా ఎంత తిన్నా తరగని ఆస్తి ఉన్నది. ఆయనకూ నాకూ సాపత్యం ఏమిటి?'

'సరే! ఎవరి అంతస్తు వారిదీ. ఆస్తి ఉన్నదిగదా అని ఆయనమాత్రం వేలకువేలు కట్నాలు గుమ్మరిస్తున్నాడాఏమిటి? చెరైదువందలూ, లాంఛనాలూట. పెద్దవాడు యఫ్. ఏ. చదువుతూన్నాడుట. చిన్నవాడు స్కూలుఫైనల్ట. ఇద్దరూ స్థితిపరులేట.'

'నీ కెవరు చెప్పారమ్మా ఈ సంగతీ! ఒక్కొక్కరికి రెండేసి వేలు ఇస్తున్నా మని ఆయన నాతో చెప్పాడే!'

'ఆయనమాటలకేం? ఆయన అట్లాగే గొప్పలు చెప్పుకుంటూ ఉంటాడు. అసలు సంగతి రాజ్యలక్ష్మమ్మగారు నాతో రెణ్ణెల్లకిందే చెప్పింది. అన్నట్టు చెప్పడం మర్చిపోయాను. రాజ్యలక్ష్మమ్మగారి మాటొస్తే జ్ఞాపకం వచ్చింది. మొన్న నేను వాళ్లింటి కెళ్లినప్పుడువిన్నాను. వింజమూరి సీతాపతిరావుగారుట.మన వాళ్లేనట. ఆయనా, రాజగోపాలంగారూ కలిసి చదువుకున్నారట. అందుకని వాళ్లింటి కొచ్చారు మొన్న. వాళ్లబ్బాయి ఉన్నాడట పెళ్లీడువాడు. ఏం చదువుతున్నదీ అదీ వివరంగా కనుక్కుందా మంటే పేరంటం తొందఱలో వీల్లేకపోయింది. వాళ్లది బెజవాడేట కూడా. ఇవ్వాళా, రేపూ సెలవేగదా! కాస్త రాజగోపాలంగారిని అడిగి వివరాలు తెలుసుకుని మన కందుబాటులో ఉండేదయితే బెజవాడవెళ్లి మాట్లాడి రాగూడదూ? రేపు సాయంత్రానికి తిరిగిరావచ్చు. ఏమంటారు?'

'ఏమనేందు కేమున్నది? బెజవాడే వెళ్లివస్తే సరి! మళ్లీ రాజగోపాలంగారి నడగడం ఎందుకూ మధ్య?'

'అదేమీ దగ్గఱ ఉన్నది! ఎవ్వరినీ కలుపుకోరు. కాస్త ఆయన్ని అడిగితే వాళ్ల కేమాత్రం చూపున్నదీ తెలుస్తుందిగా. అది మన కందే దయితేనే వెళ్లవచ్చు.'

'దాని కేమిటిలే! బెజవాడ వెళ్లి వచ్చినంత మాత్రంలో మన కేమీ నష్టం లేదు. అక్కడ మా పెత్తల్లికొడు కున్నాడు. వాడి నడిగితే సరి వాళ్ల సంగతులన్నీ తెలుస్తాయి. మావాణ్ని చూసి వచ్చినట్టూ ఉంటుంది. మన పనీ జరుగుతుంది.'

'సరే! అల్లాగయితే ఎప్పుడు బయలుదేరుతానంటారు?'

'నువ్వు పోయి వంట కానీ ముందు. ఇప్పుడప్పుడే పదకొం డయింది. భోజనమైతే ఎప్పుడు బయలుదేఱినా బయలుదేఱవచ్చు.'

ఈ మాటల్లో అమ్మాయిపెళ్లి ఇంతవరకూ కాకపోవడానికి తన ఆలస్యమే కారణ మని నరసింహారావు ఉద్దేశ్యమైనట్లు ఆవిడ ఊహించి ముఖాన గంటుపెట్టుకుని చరచరా లోపలికి వెళ్లిపోయింది. నరసింహారావు ఒక్కడూ కుర్చీలో మిగిలిపోయి పిల్లపెళ్లికి కట్నండబ్బులు ఎలా సమకూర్చడమా అనే సమస్యలో పడి కొట్టుకొంటున్నాడు. ఎంతసేపటికీ ఏ ఉపాయమూ తోచక సంబంధం అంటూ కుదిరితే ఆమాత్రం సర్దుకోలేక పోతామా అనే ధైర్యంతో కాస్త మనస్సుకు స్వస్థత చిక్కేసరికే లోపలనుంచి 'వంటైంది. నాదేమీ ఆలస్యం లేదు.' అంటూ కేక వినపడింది. అప్పుడే కుర్చీలో వెనక్కి జేర్లబడిన నరసింహారావు ఉలిక్కిపడి లేచి బెజవాడ ప్రయాణం గంటలలోదల్లా నిమిషాలలో పడడం జ్ఞాపకంతెచ్చుకుని ఎక్కడ లేని తొందఱా తెచ్చిపెట్టుకుని లోపలికి వెళ్లాడు.

పిల్లపెళ్లిసంబంధంకోసం భర్తను త్వరగా సాగనంపాలనే ఆతురతతో నరసింహారావుభార్య తా నిదివఱ కెన్నడూ చెయ్యనంత తొందఱగా వంట చేసింది. అన్నీ బాగానే ఉన్నాయి కాని పప్పులో

వేద్దామనుకున్న ఉప్పు కూరలో వెయ్యడంచేత అవి రెండూ మాత్రం చెడిపోయాయి. ఎంతసేపటికీ యింగువ గడ్డ చితక్కపోతే ఆ గడ్డగడ్డా అట్లాగే పడవెయ్యడం చేత కొంచెం ఎక్కువయినా పులుసు బాగానే ఉంది. ఆపని చేస్తూ ఒకమాటూ, ఈపని చేస్తూ ఒకమాటూ అన్నం పట్టిచూసి పలుకుగా వుందని కాసినికాసిని నీళ్లు పొయ్యగా చక్కగా మెత్తబడి ఆశ్వే నమలవలసిన అవసరం లేకపోయింది. త్వరగా వెళ్లాలన్న తొందరలో నరసింహారావు ఇవేవీ గమనించనేలేదు. మొదట్లో విస్తట్లో పెట్టిన అన్నంతోనే అర్ధాంగికికూడా సరిపడినంత ఉంచేసి త్వరగా భోజనం ముగించి లేచాడు. అత నింకా చొక్కా తొడుక్కున్నాడో లేదో అతని భార్య చేసంచీలో రెండు పంచెలూ, రెండు చొక్కాలూ, ఒక తువ్వాలూ పెట్టి పట్టుకొచ్చి చేతికిస్తూ వక్కపలుకుకూడా అందించింది. ఆ వక్క నోట్లో వేసుకుని ఒక్కనిముషమన్నా కూర్చోకుండా ఉత్తరీయం పైన వేసుకుని చెప్పులు తొడుక్కుని బయలుదేరబోతూ 'మరి నే వెళ్లివస్తాను, ఇల్లూ పిల్లలూ జాగ్రత్త' అని అంటూ వీధివైపుకు మొహం తిప్పాడు. 'నేను జాగ్రత్తగానే ఉంటానుగాని మీరు మాత్రం ఏమైనాసరే సంబంధం నిశ్చయంచేసుకురావాలి సుమండీ!' అని నిష్కర్షగా చెప్పి 'మరి నే ఉంటాను' అంటూ వీధితలుపు వేసి లోపలికి వెళ్లింది.

అతను వీధిలోకి వచ్చి నాలుగడుగులు వేశాడో లేదో అతని భార్య తలుపు తీసి వీధిగుమ్మంలో నిలబడి—

'ఏమండోయ్, ఒకమాట' అని కేక వేసింది.

'ఆ చెప్పేదేమిటో ఇంట్లో ఉండగానే చెప్పరాదూ? బయలుదేరాక వెనక్కి పిలవద్దని ఎన్నిసార్లు చెప్పినా నువ్వింతే' అని విసుక్కుంటూ తిరిగి 'ఆ! ఏమిటో చెప్పు-త్వరగా వెళ్లాలి' అని నిలబడ్డాడు.

'అబ్బ! ఇన్నాళ్లనుంచీ లేని తొందర ఇవ్వాళ వచ్చింద' అని నవ్వుతూ 'అయితే మీరు మీపెత్తల్లిగారింటికి వెళ్తారా, ఇంకెవరన్నా స్నేహితులింటికి వెళ్తారా?'

'ఆసంగతి అక్కడకు వెళ్లాక ఆలోచిస్తాను. ఇందుకేనా పిలిచింది?'

'అంత విసుక్కుంటా రెందుకండీ? మీ పెత్తల్లిగారింటికి వెళ్లితే నాకేంగాని పూర్ణానందంగారి గుడి పక్కసందులో మా రాజమ్మపిన్ని ఉన్నది. ఆవిణ్ని చూసిరండి'

'ఏమో నాకు తీరుబడి ఉంటేమాట' అంటూ అతడు కాలు కదపబోయేసరికి 'అదేమిటండీ అట్లా అంటారు? ఆవిడ కావింజమూరివారు బాగా తెలుసునుట. క్రిందటిసారి దసరాపండుగలకు మన ఊరు వచ్చినప్పుడు ఏదో సందర్భంలో నాతో చెప్పింది. ఆ సంగతి ఇప్పుడు జ్ఞాపకంవచ్చి మిమ్మల్ని వెనక్కి పిలిచాను. అదీగాక ఆవిడకు మనవాళ్లు ఏయేఊళ్లల్లో ఎక్కడెక్కడ ఉన్నదీ అన్నీ తెలుసు. మన పిల్ల పెళ్లి తొందరలో చెయ్యాలని ఆవిడతో గనక చెపితే ఈ సంబంధం కాకపోతే మరేసంబంధమైనా కుదిర్చిపెడుతుంది. నామాట విని ఆవిణ్ని కలుసుకుని అన్ని విషయాలూ మాట్లాడి రండి. ఈవింజమూరివారి సంబంధం విషయంలోనైనా ఆవిడ మీకెంతో సహాయం చెయ్యగలదు. ఏం, తప్పకుండా కలుసుకువస్తారుకదూ!' అని ఆవిడ తీవ్రంగా హెచ్చరించి వాకిటితలుపు వేసి వెంటనే మళ్లీ తీసి-'ఏమండోయ్. అన్నట్టు మర్చిపోయాను. మీరిదివరకెప్పుడో మీస్నేహితుడు సత్యనారాయణ కొడుక్కి అమ్మన్న నిద్దామంటూ వచ్చారుకదండీ. ఇప్పుడాయనగూడా బెజవాడలోనే ఉన్నాడటగా. వాళ్ల మాటకూడా కనుక్కరండీ!' అని అనేటప్పటికి నరసింహారావు— 'తీరా వెళ్లాక ఒకటి కనుక్కుని ఒకటి కనుక్కోకుండా వస్తానుటే పిచ్చిదానా! ఇప్పుడే నే నా మాట అనుకుంటున్నాను. నువ్వూ జ్ఞాపకం చేశావు. అన్నీ కనుక్కునేవస్తానుగాని నువ్వింట్లోకి పోయి నన్ను పోనియ్యి ముందు' అని అంటూ నడక సాగించాడు.

అతడు వీధిమలుపు తిరిగేవరకూ ఆవిడ అట్లానే ఈవిషయం ఆవిషయం జ్ఞాపకంచేస్తూ ఉండగా మొత్తమ్మీద నరసింహారావు కార్లస్టాండువైపు చకచకా నడిచాడు.

౨

నరసింహారావు పెత్తల్లికొడుకు రాజేశ్వరానికికూడా బడిపంతు లుద్యోగమే. రాజేశ్వరంతండ్రి తన కున్న కొద్ది ఆస్తినీ చేతనైనంతవరకూ పెంచాడేకాని నరసింహారావుతండ్రిలాగా సన్మార్గంలోనే అయినా పిల్లలకు కాకుండా చెయ్యలేదు. అదీగాక అతనికి రాజేశ్వరం ఒక్కడే కొడుకు. తొలిచూలు సంతానం రుక్మిణమ్మకు ఉన్న సంబంధం చేశాడు. వీళ్లకంటే వాళ్లు ఆస్తిపరు లవడంచేత ముసలాయన పోయిన దగ్గఱనుంచీ వీళ్లవంక చూడకపోయినా వాళ్లంతటవాళ్లు సుఖంగానేఉన్నారు. కావలసినంతఉండీకూడా బావమఱది అదీ యిదీ అడుగుతూంటే సహించడుకాని రాజేశ్వరానికి స్నేహితులూ,చుట్టాలూ తన యింటికి రావడమంటే సరదా. అతని సరదాని భార్యచిరకాలరుగ్మత కొంత తగ్గించినా తల్లి బ్రతికిఉన్నంతకాలమూ తన యింటికి కావలసిన ప్రతివాడూ రాకతప్పదు.

అనుకున్నట్లుగానే సాయంత్రానికి నరసింహారావు రాజేశ్వరం ఇంటికి చక్కా వచ్చాడు. అతడింకా వీథిగుమ్మంలోకి రాకముందే అప్పుడే టీ త్రాగి పడకకుర్చీలో కూర్చున్న రాజేశ్వరం 'అమ్మా! నరసింహం అన్నయ్య వస్తున్నాడేవ్' అని తల్లిని కేకేసి నరసింహారావు వంకకు తిరిగి, 'రా అన్నయ్యా! రా! బందరునుంచేనా రావడం ? అంతా కులాసాయేనా ? దగ్గఱిలో ఉండికూడా ఎన్నాళ్లయిందిరా మనం కలుసుకుని' అంటూ ఆహ్వానంతోపాటు కుశలప్రశ్న పరంపర వదలిపెట్టి, 'అమ్మాయి, సూరీడూ! బందరునుంచి పెద్దనాన్న వచ్చాడు, కాళ్లు కడుక్కోనేందుకు నీళ్లు పట్టుకురా' అని కేకేశాడు. రాజేశ్వరం పదేళ్లకూతురు సూరీడు చెంబూనీళ్లతో పాటు తువ్వాలు పట్టుకురాగా కాళ్లూ చేతులూ కడుక్కొని, తువ్వాలుతో తుడుచుకుంటూ రాజేశ్వరం చూపించిన కుర్చీలో కూర్చొని 'సూరీ డెంత బుద్ధిమంతురా లయింది రా!' అని దాని బుగ్గ పట్టుకుని ముద్దుపెట్టుకున్నాడు నరసింహారావు. ఇంతలోకే రాజేశ్వరంతల్లి టీ పట్టుకొచ్చి బల్లమీద పెడుతూ 'ఏరా ! నరసింహం! మాణిక్యం, పిల్లలూ కులాసాగా ఉన్నారా' అని యింకా యేమో అడగబోతూ ఉండగానే నరసింహారావు 'అంతా కులాసాగానే ఉన్నారు పెద్దమ్మా' అని సమాధానం చెపుతూ చేసంచీలోంచి మిఠాయిపొట్లం తీసి సూరీడును కేకేసి చేతికిచ్చి దగ్గఱ కూర్చోబెట్టుకున్నాడు. లోపలినుంచి తల్లి దగ్గుతూ ఉండడం వినబడి సూరీడు లేవబోతే దాన్ని వదలిపెట్టి నరసింహారావు 'ఒరేయ్! రాజేశ్వరం! మఱదలి దగ్గు ఇంకా నయంకాలేదురా?' అని తెల్లబోయిన ముఖంతో ప్రశ్న వేశాడు. దీనికి రాజేశ్వరం విచారసూచకమైన ముఖంతో 'అవునురా అన్నయ్యా! అప్పటినుంచీ ఆ దగ్గు అట్లాగే ఏడిపిస్తోంది రా! ఎన్ని మందులో ఇప్పించాము. ఏమీ తగ్గలేదు. ఎంతమంది డాక్టర్లకు చూపించినా ఇదేం లాభంలేదు, బతికున్నన్నాళ్లూ అనుభవించాలిసిందే అంటున్నారు. ఈ జబ్బుకుతోడు మా ఆవిడ కీమధ్య ఒక పెద్ద బెంగ కూడా పట్టుకుంది. పిల్ల పెళ్లి చూడకుండా పోవలసి వస్తుందేమోనని. కాస్త తగ్గనియ్యవే, పిల్ల పెళ్లి చెయ్యలేకపోతామా యేమిటి- అయినా దానికి పదేళ్లేకదా- ఇంకో నాలుగేళ్లు పోనీవే అంటే వినదు. దీన్ని మనసులో పెట్టుకుని నన్ను సాధిస్తూ ఉద్రేకం పొందుతూ దగ్గు పెంచుకుంటూ కూర్చుంటుంది. ఏం చెయ్యమంటావురా అన్నయ్యా! నాకేమీ పాలుపోవడం లేదు' అంటూ ముఖం చిట్లించుకు కూర్చున్నాడు. వెంటనే రాజేశ్వరంతల్లి అందుకుని 'చూశావురా నరసింహం! ఇట్లా వుందిరా ఇంటిపరిస్థితి. ఇరవయ్యేళ్లు సంసారం చేస్తే కలక్క కలక్క చివరి కొక కూతురు పుట్టింది. దానికన్నా పెళ్లిచేసి ముద్దూ ముచ్చటా తీర్చుకుందామని కోడలి తహతహ. వీడేమో పధ్నాలుగేళ్లైనా రాందే పెళ్లేమిటంటాడు. అదీగాక దాని కంత జబ్బుగా ఉంటే పెళ్లిచెయ్యడం ఎట్లా! అదీ నిజమే! నాజబ్బు నాతోనే గాని పోదు- అది నయమయేదాకా కూర్చుంటే పెళ్లి కానేకాదు- ఎట్లాగో అట్లాగు చేసెయ్యాలిసిందే అంటుంది కోడలు. నేనేమో వీళ్లిద్దరి మధ్యా ఏ సంగతీ నిశ్చయం చేసుకోలేకుండా ఉన్నాను. ఆయన బతికివుంటే ఇట్లా అయ్యేది కాదు గదా!' అని ఒక నిట్టూర్పు విడిచింది.

‘ఆమాట నిజమే అనుకో పెద్దమ్మా! ఆయన కేం మహరాజు, ఆయన దారిని ఆయన పోయాడు. ఆయన లేడనుకుంటే ప్రయోజన మేమిటి? ప్రస్తుతం ఆలోచించుకోవాలి గాని’ అని నరసింహారావు పెత్తల్లితో అంటూ రాజేశ్వరం వైపు తిరిగి ‘అదేమిటిరా తమ్ముడూ! అట్లా విచారంతో కూర్చుంటే ఎట్లారా. సాధక బాధకాలు ఆలోచించుకుని ఏదో ఒక నిశ్చయం చేసుకుని పని అయ్యే ఉపాయం చూచుకోకపోతే ఎట్లా? మరదలి కట్లాంటి అభిప్రాయం ఉన్నప్పుడు తప్పకుండా దాని ఇష్టప్రకారం పెళ్లి చెయ్యాలిసిందే! అయితే ఇంతకీ ఏమన్నా సంబంధాలు చూశావుట్రా?’

‘చూడకేంరా! నేనుమాత్రం ఊరికే కూర్చున్నానుట్రా. అడపాదడపా వీలైనప్పుడల్లా ఆవూరూ ఈవూరూ పోయి వాకబు చేస్తూనే ఉన్నాను. సంబంధాల కేంరా లక్ష లున్నాయి. ఏదో ఒకటి ఖాయం చేసుకోవచ్చు. అయినా నాకేమిటో దాని కలా ఉండగా పిల్లపెళ్లి చెయ్యడానికి మన సొప్పటంలేదు. నువ్వెన్నన్నా చెప్పు!’

‘నీచాదస్తం నీది. నువ్వు సంబంధం నిశ్చయం చేసి ముహూర్తం పెట్టించు. అది రేపీపాటికి లేచి కూర్చుని పెళ్లిపను లన్నీ చేసుకుంటుంది. నువ్వింక ఆ అనుమానం పెట్టుకోక నే చెప్పినట్లు త్వరగా కానీ!’

‘సంబంధం నిశ్చయం చెయ్యడాని కేంరా! ఒకవిధంగా చేసినట్టేకూడా. కావాలంటే ఇవ్వాళో రేపో మంచిరోజు చూసి తాంబూలాలుగూడా ఇచ్చి రావచ్చు.’

‘ఏమిట్రా ఆడపిల్లసంబంధం అంటే అంత తేలికగా చెప్తావు. నేనూ మా అమ్మన్న పెళ్లి చేద్దామని సంబంధాలకోసం నానాతిప్పలూ పడుతున్నాను. ఆరునెల్లబట్టీ అదే ప్రయత్నంలో వుంటే అతీ గతీ లేకుండాఉంది. నువ్వేమిటో ఇట్టే తేల్చేస్తున్నావు. ఎక్కడ చూశావు? ఎవరి సంబంధం? కట్నాలూ కానుకలూ ఎంతదాకా పెంచావు? ఏమిటీ! వివరంగా చెప్పు!’

‘కట్నాలూ కానుకల కేమిటిరా! అన్నీ వెయ్యిన్నూటపదహార్లు. ఆడబిడ్డల లాంఛనాలుగూడా అందులోనే. పెళ్లికొడుకు సీనియర్ ఇంటర్మీడియేటు చదువుతున్నాడు. పదహారేళ్లుంటాయి. దబ్బపండులా ఉంటాడు. మంచి బుద్ధిమంతుడు. సంప్రదాయం మంచిది. నలుగు రన్నదమ్ముల్లోనూ పెద్దవాడు. అతనివంతు కొక పాతికెకరాల మాగాణి వస్తుంది. తండ్రి డిప్యూటీ తాశీల్దారు చేస్తూ సంపాదిస్తూనేఉన్నాడు. ఈమాత్రం సంబంధం మనకు చాలదా ఏమిటి?’

‘చాలకేమిట్రోయ్! బలే మంచి సంబంధం చూశావురా! తేలికలోనే సంపాదించావే. అంతా బాగానేవుందికాని ఏ వూళ్లోనో, ఎవరో చెప్పావు కావేం?’

‘మరోవూరుగూడా పోనక్కఱలేదురా! ఈ వూళ్లోనే! మా అమ్మాయిని మే మెల్లకాలమూ చూసుకుంటూ ఉండవచ్చు. అయితే అన్నయ్యా! నువ్వుగూడా రేపల్లా ఉండరా! ఇవ్వాళ మధ్యాహ్నమే వెళ్లి పెళ్లికొడుకుజాతకం పట్టుకొచ్చాను. రేపు ఉదయం రెండు జాతకాలూ జోస్యులుకు చూపించి సరిగా వున్నవిషయం తెలుసుకుని తాంబూలాలు ఇచ్చివద్దాము. ఏమంటావ్!’

నరసింహారావు ‘దానికేం, అల్లాగేరా’ అని సమాధానం చెప్పబోతూఉండగానే పెత్తల్లి అడ్డువచ్చి ‘అవున్రా నరసింహం! నువ్వు తప్పకుండా ఉండాలి. నువ్వుంటేగాని మావాడికి చులుకుండదు. నీతో ఐతే ఇన్నివిషయాలు చెప్పాడుగాని మే మెవరమన్నా అడిగితే కన్నుమనేవాడు. నువ్వంటే వాడి కంత గౌరవం. నీధర్మమా అంటూ రేపు తాంబూలాలు ఇచ్చివచ్చి ముహూర్తనిశ్చయం చేయించావా అంటే నువ్వన్నట్టు కోడలికి జెంగ వదిలి దగ్గు నయమౌతుంది. మాయిల్లు కళకళలాడుతుంది. మానాయనగా! నువ్వు మరోమాట చెప్పక తప్పకుండా ఉండిపోవాలి’ అంటూ బ్రతిమాలడం మొదలుపెట్టింది. ‘అదేమిటమ్మా పెద్దమ్మా! మీయింట్లో పని నాయింట్లోది కాదుటమ్మా! ఇంత మాత్రానికే అంత బతిమాలటం ఎందుకమ్మా!’ అని ఆవిడను సమాధానపఱచి, ఇదివఱ కొకసారి అడిగినా

పెండ్లికొడుకు ఫలానివారబ్బాయని రాజేశ్వరం మాటలధోరణిలో చెప్పకపోవడం గుర్తుతెచ్చుకుని ఆసంగతి తెలుసుకుందామనే కుతూహలంతో 'ఏరా రాజేశ్వరం! ఇంతకూ ఎవరబ్బాయో చెప్పావుకా దేమిట్రా' అని అడిగాడు నరసింహారావు.

నరసింహారావు తనింటి కెప్పుడు వచ్చినా గంటో రెండుగంటలో ఉండి వెళ్లిపోయేవాడు ఈ సారి మర్నాడల్లా ఉండడానికి ఒప్పుకుంటాడో ఒప్పుకోడో, ఒప్పుకోకపోతే తనేం చెయ్యావలసిందీ ఊహించుకుంటున్న రాజేశ్వరం ఈప్రశ్న కులిక్కిపడి 'ఓరి నా మందమతి పాడుగాను. ఇంతా చెప్పి, ఆ సంగతి చెప్పనేలేదుట్రా. బలేవాణ్నే. అయినా ఈ వూళ్లో డిప్యూటీ తాసీల్దారుగారిని నువ్వెరుగుదువనుకున్నారా! ఆయనపేరు వింజమూరి సీతాపతి రావుగారు.' అని అన్నాడు.

ఈ మాట వినేటప్పటికి నరసింహారావుముఖం ఎండబెట్టిన తాటాకులా తెల్లబడిపోయింది. తాను ఇన్నాళ్లకు కాలుకదిపి బెజవాడ వచ్చింది ఆ సీతాపతి రావుగారి కొడుక్కి తన కూతుర్నిద్దామని. ఆ సంబంధం కాస్తా తనకు తెలియకుండానే తన తమ్ముడు అతని కూతురుకు నిశ్చయంచేసుకున్నాడన్న సంగతి తెలియడంతోటే మనస్సు దిమ్మెక్కినట్లయిపోయి ఏ ఆలోచనా తోచలేదు. తాను బెజవాడ వచ్చిం దిందుకే అని ఇంత మాటపోయాక చెప్పడ మంత భావ్యం కాదు. అందుచేత తన ముఖంలో మార్పు వాళ్లు గమనించిపోతారేమో ననీ, ఏమాత్రం ఆలస్యం చేసినా పట్టుబడిపోగలననీ ధైర్యంతెచ్చుకుని వెంటనే నరసింహారావు 'ఆయనెవ్వరైతే నే నెరగనుగాని ఆయన పేరు నేను చాలామాట్లు విన్నారా! వాళ్లు చాలా మంచివాళ్లుట' అని ప్రయత్నపూర్వకంగా తడుముకోకుండా అనేశాడు.

'అయితే ఇంతకూ ఆసంబంధం చెయ్యాదగ్గదే నంటావు. మరి నువ్వు రేపు వుండి తాంబూలా లిప్పించడంమాటేమిటి' అని రాజేశ్వరం మళ్లీ ప్రశ్నవేశాడు. ఈప్రశ్న ఎట్లాగూ వస్తుందని మనస్సుకు లేని చులుకు తెచ్చుకుని ఊహిస్తూనేఉన్నాడు నరసింహారావు.

తాను వచ్చిన పని సానుకూలం కాకపోగా అనవసరంగా పరాయివూళ్లో వుండవలసివస్తోంది. ఇది అతనికి సుతరామూ ఇష్టంలేదు. అకస్మాత్తుగా అతని కొక ఆలోచన తట్టగా 'అదెట్లా కుదురుతుందిరా రాజేశ్వరం! నాసంగతి బొత్తిగా తెలియనట్లు మాట్లాడతావు. నే నింట్లోనుంచి ఎంతో పనుంటేగాని సాధారణంగా కదలనుగదా! తెనాల్లో మా స్నేహితుడి కొకడికి ప్రాణం మీది కొచ్చిందని పొద్దున్నే కబురువస్తే రాత్రికన్నా వాళ్ల వూరు చేరుకుందా మని బయలుదేరాను. ఊరి మీదుగా పోతూ మిమ్మల్ని చూడకుండా వెళ్లడం ఎందుకని మీయింటికి వచ్చాను. ఇప్పు డేడుగంటల బండిలో వెళ్లిపోవాలి' అని తకీమని అతుక్కుపోయే అబద్ధం ఆడేశాడు ముందూ వెనకా ఆలోచించకుండా. ఈమాటలు వింటూనే వున్న రాజేశ్వరం తల్లి 'ఇది మరీ బాగుందిరోయ్. ఎంత పని ఉన్నా సరే ఈపూట భోజనం చెయ్యకుండా మాత్రం వెళ్లడానికి వీల్లేదు. అంత తప్పనిసరి అయితే తొమ్మిదిగంటల బండిలో వెళ్లవచ్చునులే' అని బలవంతం చేసింది. దీన్ని రాజేశ్వరంతోపాటు నిలబడివున్న తన రెండు చేతులూ పట్టుకుని 'నిన్ను వెళ్లనివ్వను. నువ్వు మాయింటోనే భోంచెయ్యాలి పెద్దనాన్నా' అని సూరీడుకూడా జలపరిచేటప్పటికి 'సరే అట్లాగే కానివ్వండి' అని అనక తప్పిందికాదు నరసింహారావుకు.

ఈమాట అతడనేటప్పటికి కుర్చీకి తగిలించిన గొడుగూ, పక్కన పెట్టిన సంచీ రెండూ పట్టుకుపోయి సూరీడు లోపల పెట్టింది. రాజేశ్వరంతల్లి అప్పుడే మడిగట్టుకోవడంచేతా, గంట యింకా ఆరు కాకపోవడంచేతా, వచ్చినపని ఎదురుతిరిగిన కారణంచేతా ఏమీ తోచక నరసింహారావు కాసేపు బయట చల్లగాలికి తిరిగివద్దామని రాజేశ్వరాన్ని అడిగాడు. తల్లి మడిగట్టుకున్నప్పుడు భార్యను కనిపెట్టుకుని ఉండవలసిన బాధ్యత తనమీద వుండడంచేత అతడు రానన్నాడు.

నరసింహారావు ఒక్కడే బయలుదేరి వీధి మలుపు తిరిగేసరికి అతని స్నేహితుడు వెంకట్రామయ్య బజారునుంచి సరుకులు తెచ్చుకుంటూ కనపడి

'ఏమిట్రోయ్ నరసింహం! ఈవూ రెప్పుడొచ్చావ్' అని పలకరించాడు.

'సాయంత్రం నాలుగుగంటలకు వచ్చాను. మా రాజేశ్వరాన్ని చూచిపోదామని'.

'ఖులాసాగానే ఉన్నాడుగా,విశేష మేముంది'

'వాడి భార్య కేదో జబ్బుగా వుంటే—'

'అవునవును ఆమాటా విన్నానురా. నువ్వూ, నీపిల్లలూ ఖులాసాగా వున్నారా! అన్నట్టు మా అమ్మాయిపెళ్లి చేస్తున్నానురోయ్ వైశాఖమాసంలో. సంబంధమే ఇంకా నిశ్చయం కాలేదు. నీసలహా తీసుకోవాలని మీవూరొద్దామనుకుంటున్నాను. ఆడ బోయిన తీర్థ మెదురయినట్లు నువ్వే ఈవూ రొచ్చావ్. మాయి ల్లిక్కడే. పోదాం రారా.'

'ఇప్పుడు మీయింటికి రావడం కుదరదురా. తొమ్మిదిగంటలబండికి తిరిగివెళ్లి పోవాలి. ఆమా టేమిటో ఇప్పుడే అడగరాదూ'

'దానికేంగాని - మటీ రోడ్డుమీ దేమిటి? ఇలా ఈ అరుగుమీద కూర్చుందాం రా.—ఆ-ఏం లేదురా. నీతో బి. ఇ. డి. చదివాడు చూశావు వారణాసివాడు, వాడి కొక్కడే కొడు కున్నాడురా. ఆకుర్రాడు స్కూలుఫైనల్ ప్యాసయ్యాడు.మంచి బుద్ధిమంతుడుట. కాని ఆ సత్యనారాయణకే మతి స్థిరం లేదని అంటూ ఉంటారురా. అతను నీతో చదువుకున్నాడు, నీకూ వాడికీ బాగా జోస్తీ వుందిగదా-నిన్నడిగితే వాడి సంగతి బాగా తెలుస్తుందని అడుగుదా మనుకున్నానురా. ఏమంటావ్!'

నరసింహారావు కిది గోరుచుట్టుమీద రోకటిపో టయింది. రాజేశ్వరం ఎంత దగ్గఱవాడో వెంకట్రామయ్య అంత దగ్గఱస్నేహితుడు. తన భార్య తాను వచ్చేటప్పుడు ఈ సత్యనారాయణ సంబంధం మాట కూడా జ్ఞాపకంచేసింది. సీతాపతిరావుగారి సంబంధం జాఱిపోయిందని విచారపడుతూంటే సత్యనారాయణ సంబంధంకూడా అంతవఱకూ వచ్చింది. సత్యనారాయణనుగుఱించి తన కేమీ ఇటీవల తెలియటల్లేదని తప్పించుకుంటాడా-మిత్రుణ్ని మోసగించినట్లవుతుంది. చివఱకయేది ఎట్లాగూ కాకతప్పదని—

'సత్యనారాయణకేంరా, నిక్షేపంలాటివాడు. అతని తెలివితేటలు చూసి ఓర్చనివాళ్లూ, అత డెంతవాణ్ణయినా నిర్లక్ష్యంచేసి తప్పుచేసినప్పుడు జాడించడం సహించనివాళ్లూ అతన్నిగూర్చి అట్లా అంటారేకాని నిజంగా అతను చాలా మంచివాడు' అని తన ఉద్దేశ్యం చెప్పి, ఇక వెళ్లిపోతా నని సెలవు తీసుకుని మాట్లాడకుండా ఇంటికి వచ్చేశాడు.

తాను ఇంటికి రావడంతోటే రాజేశ్వరం తన కోస మెదురుచూస్తూ ఉండడంవల్ల నరసింహారావు తొందఱపడి స్నానాదికం ముగించుకుని భోజనానికి తయారయ్యాడు. భోజనం చేస్తున్నంతసేపూ నరసింహారావు పరధ్యానంగా ఉండడం చూసి రాజేశ్వరంతల్లి ఆపేక్షతో హెచ్చరిస్తూ, తొందఱలేదని బలవంతపెడుతూ ప్రతివస్తువూ కనుక్కోగా మొత్తమ్మీద భోజనం పూర్తిచేసుకుని ఇద్దఱూ వాకిట్లో అరుగుమీద కూర్చున్నారు. తాంబూలం వేసుకుంటూనే చేతిగడియారం వంక చూసి 'ఎనిమిదయిందిరా! ఇక నే పోతాను' అంటూ నరసింహారావు లేచాడు. ఇది విని 'అమ్మా! అన్నయ్య బయలుదేరుతున్నాడేవ్' అని తల్లిని కేకేసేసరికి ఆవిడ అన్నంవడ్డించుకుంటున్న అంటచేత్తోనే హడావిడిగా పరుగెత్తుకొని వచ్చి 'ఒరేయ్! నరసింహం! అయితే నువ్వు తెనాలేగా వెళ్లడం? మొన్న పిన్నీవూరొచ్చి దాని కున్న రెండు చీరల్లోనూ ఒకటి పొరపాటున మా చాకలివాడి గుడ్డల్లో పడితే ఇక్కడే వదిలిపెట్టిపోయిందిరా. దాన్ని వాడుతికి తెచ్చాడు. పాపం, అది ఎంత ఇబ్బందిపడుతోందోరా. బాబాయి పోయాక దాన్ని పిలిచి ఇంతమంది ఉన్నాం ఒక్కళ్లమూ ఒక సైనుగుడ్డ పెట్టిన పాపాన పోలేదు. ఈ మాయదారి గుడ్డలకరు వొకటి వచ్చి మన నెత్తిన పడె. ఆనాటినుంచీ పాపమది ఆ రెండు చీరల్తోనే కాలం గడుపుతోంది.' అని కళ్ల నీళ్లు పెట్టుకుంటూ అని, ఇంతలో సూరీడు దగ్గరకు రాబోతే 'అదేమిటే! ముట్టుకుంటావేమిటి? దూరంగా ఉండు. అన్నట్లు అమ్మ పెట్టెలో పెట్టాను, చిన్నబామ్మచీర ఇట్లా పట్టుకురా' అని దానితో చెప్పి, మళ్లీ నరసింహారావుతో 'బాబ్బాబు-ఆచీర పట్టుకుపోయి దాని కిద్దూ. నువ్వు కొత్తచీర

ఇచ్చినట్లుగా సంతోషిస్తుంది' అని ఊరుకునేప్పటికి నరసింహారావు కేమనడానికీ మాట రాలేదు. అయినా మరొక అబద్ధం ఆడితే తప్పిపోతుందేమో నని 'చీర తీసుకువెళ్లడానికేంగాని పెద్దమ్మా! నేనిప్పుడు సరాసరి తెనాలి వెళ్లడం లేదు. గుంటూరులో నేను బాగా ఎరుగున్న డాక్టరొక డున్నాడు. ఆయన్ని వెంట బెట్టుకుని అక్కడినుండి తెనాలి మెయిలు కందించే బండిలో వెళ్తాను. ఈ తొందరలో ఎక్కడన్నా మర్చిపోతానేమో నని ఆలోచిస్తున్నా' నన్నాడు. ఇంతలో రాజేశ్వరం 'సాయంత్రంనుంచీ ఆమాట చెప్పావు కాదేమిట్రా! తెనాలి సరాసరి వెళ్తావేమోనని ఇందాకటినుంచీ ఊరుకున్నాను. గుంటూరుమీదుగా వెళ్తావని తెలిస్తే ఇందాకనే చెప్పేవాణ్ణి. మూడునెల్లక్రింద మా బావమరది తన కెమేరా బాగుచేయించ మని ఇచ్చిపోయాడు. దాన్నప్పుడే బాగుచేయించాను. అది వాడకుండా అట్లాగే వుంచితే తుప్పట్టి పాడై పోతుంది. ప్రతి ఉత్తరంలోనూ కెమేరా పంపమని వ్రాస్తాడే కాని ఒక్కసారీ వచ్చి తీసుకుపోడు. పోస్టులో అన్నా, రైల్లో అన్నా పంపుదామంటే దానికి చచ్చేటంత బందోబస్తు చెయ్యాలి. నేనే వెళ్లి వద్దామంటే మా బడిసంగతి నీకు తెలుసునుగదా! వాడిల్లు సరీగ్గా స్టేషనుకు ప్రక్కనే. నువ్వెట్లాగూ వూళ్లోకి పోతున్నావు కాబట్టి పోతూపోతూ దీన్నక్కడ పడేసిపోదూ' అని అంటూ అతని చేతిలో సంచీ లాక్కుని లోపలికి పోయి బావమఱది కెమేరా, సూరీడు తెచ్చిన పింతల్లి చీరా రెండూ సంచీలో పెట్టి అతని చేతి కిచ్చాడు. నరసింహారావు కొయ్యయిపోయి అంతలో తెలివి తెచ్చుకుని ఇంకా ఆలస్యం చేస్తే ఇట్లాంటివి చాలా తగులుతాయేమో నని భయపడి 'అమ్మాయినీ పిల్లల్నీ అడిగానని చెప్పరా' అంటున్న పెద్దమ్మ మాటలు గూడా వినిపించుకోకుండా చరచరా నడిచి బైటపడ్డాడు.

నరసింహారావు వాళ్ల యింట్లోనుంచి బైటపడ్డా డన్నమాటేగాని కొత్తగా తగులుకున్న ఈ చిక్కులలోనుంచి బైటపడలేదు. ఒక పని మీద వస్తే దాని కెదురవడమే కాకుండా అనవసరమైన పనులన్నీ చెయ్యవలసివచ్చింది. పొద్దున్నే ఎవరి మొహము చూశానోగదా అనుకుంటూ స్టేషనువైపు నడిచాడు. మనస్సు లేని శరీరాన్ని ఎట్లాగో అట్లాగు స్టేషనులో చేర్చి టిక్కట్లిచ్చే కిటికీదగ్గర నిలబడి ఐదురూపాయల నోటక్కడ పెడుతూ కెమేరాకు టిక్కట్టివ్వం డన్నాడు. ఆటిక్కట్లిచ్చే ఆయన తెల్లబోయి 'కెమేరాకు టిక్కట్టేమిటయ్యా! నీకేమయినా మతిపోయిందా! ఏవూ రెళ్లాలో చెప్పు' అని అరిచేటప్పటికి తెలివి తెచ్చుకుని, తనలో తానే నవ్వుకుని, అప్పుడు గుంటూరుబండి లేదని జ్ఞాపకం తెచ్చుకుని, తాను నిల్చున్నది మదరాసువైపుకు టిక్కట్లిచ్చే చోట అని తెలుసుకుని 'తెనాలి కివ్వండి' అని అన్నాడు. ఆయనగూడా నవ్వుతూనే టిక్కట్టివ్వగా అప్పటికప్పుడే మెయిలు వచ్చి ప్లాటుఫారం మీద వున్న కారణంచేత చకచకా వెళ్లి రైల్లో కూర్చున్నాడు.

ఆరాత్రి కట్లాగే తెనాలి వెళ్లి పినతల్లి గారింటికి పోయి ఆవిడ చీర తెచ్చియిచ్చినందుకే కాకుండా చాలారోజులకు కనబడినందులకుకూడా చాలా అపేక్షతో అతన్ని ఎన్నో ప్రశ్నలు వెయ్యగా వాటన్నింటికీ సమాధానం చెప్పి ఎంతో పొద్దుబోయి పడుకుని ఉదయం ఎనిమిదిగంటలకు నిద్రలేచాడు. లేచీ లేవడంతోటే ఆదరాబాదరాగా ముఖం కడుక్కుని స్నానమన్నా చెయ్యకుండా గుంటూరుబండి ఎక్కాడు. గుంటూరుస్టేషనులో బండీ ఆగడంతోటే వెంటనే బెజవాడ వెళ్లే బండీ ఉందని తెలుసుకుని పరుగెత్తుకు వెళ్లాడు కెమేరా ఇచ్చిరావడానికి. దాన్ని రాజేశ్వరం బావమఱదిగారింట్లో ఇచ్చేసి, రైలెక్కడ పోతుందో అనే తొందరలో ఆడవాళ్లుండమని చెపుతున్నా వినిపించుకోక పరుగెత్తుకువచ్చి టిక్కట్టు కొనుక్కుని బెజవాడవెళ్లే రైల్లో చతికిలబడ్డాడు.

ఇప్పటి కతనికి కాస్త మనస్స్వాస్థ్యం ఏర్పడింది. దారిలో తగిలిన రెండుపనులూ చేసెయ్యడం వంటిమీద పడ్డ ముండ్లకంప తీసేసుకున్నట్టనిపించింది. దాంతో అతనికి తా నేపనిమీద బయలుదేరిందీ, ఏం జరిగిందీ అంతా సినీమాలా మనసులో కనిపించింది.

అంతలో అతనికి చటుక్కున ఒక విషయం జ్ఞాపకం వచ్చింది. తాను ఇంట్లోనుంచి బయలుదేరబోతున్నప్పుడు తన భార్య బెజవాడలో రాజమ్మగారిని కలుసుకోమన్నది. తన పెత్తల్లిగారింట్లో తాను పొందిన కంగారులో ఈసంగతతడు బొత్తిగా మఱచిపోయాడు. అయినా ఇప్పుడు వెళ్లేది బెజవాడే కాబట్టి వాళ్లయింటికి వెళ్లిరావచ్చు. వీథిలో ఎక్కడన్నా రాజేశ్వరం కనబడి 'అప్పుడే వచ్చావేంరా అన్నయ్యా' అని అడుగుతాడేమో! ఇంకా ఏమన్నా పను లప్పచెపుతాడు కాబోలురా దేవుడా! ఆదివారం కాబట్టి బహుశా ఇంట్లోనే ఉంటాడు. తానూ ఏహోటల్లోనో భోంచేసి రాజమ్మగారితో మాట్లాడి అప్పటి వీలునుబట్టి రైలెక్కో కారెక్కో బందరు వెళ్లిపోవచ్చు. ఈవిధంగా మనసులో ఊహిస్తూ ఉండగా బండీ ఖాళీగానే ఉండడంవల్ల తలక్రింద సంచీ పెట్టుకుని రైలు వూపే వుయ్యాలవూపులో రాత్రి నిద్రలేని కొఱత తీర్చుకున్నాడు నరసింహారావు.

స్టేషనులో రైలాగి అరగంటసేపయినా నరసింహారావుకు నిద్ర మెలకువ రాలేదు. రైలక్కడే ఆగిపోతుంది కాబట్టి కిటికీలూ, తలుపులూ వెయ్యడానికి వచ్చినవారు కొట్టి లేపగా నిద్రలేచి సంచీ చేత్తో పుచ్చుకుని నెమ్మదిగా కళ్లు నులుముకుంటూ బయలుదేరాడు. స్టేషను దాటి ఇవతలకు వచ్చిన దగ్గఱనుంచీ తెల్ల లాల్చీ తొడుక్కుని ఎవరు కనపడ్డా రాజేశ్వరమేనని అనుకుని చాటుచాటుగా తప్పుకుని నడవడం మొదలుపెట్టాడు. తడబడుతూ, భయపడుతూ, దాక్కుంటూ అతడు నడిచే వైఖరి చూచి కొందఱతనిమీద అనుమానం సూచించే చూపులు ప్రసరించారు. ఎవరో ఒకాయన తీక్ష్ణంగా చూసేసరికి నరసింహారావుకు నిజంగానే భయమువేసి కాళ్లు వణకడం మొదలుపెట్టాయి. కాస్త తెలివి తెచ్చుకుని ఆవూరు బొత్తిగా ఎరగనివాడల్లేనూ, పల్లెటూరివాడల్లేనూ నటించి 'దగ్గఱలో ఎక్కడన్నా పూటకూటిల్లుందా బాబూ!' అని అడిగేటప్పటికి 'అదిగో ఆబల్ల కట్టిందే' అని చూపిస్తూ ఆయనదారి నాయన పోయాడు. నరసింహారావు త్వరత్వరగా హోటల్లో దూరి నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని ఈసారైనా రోడ్డుమీద సరీగా నడవాలని జాగ్రత్తపడుతూ రాజమ్మగారింటివైపుకు బయలుదేరాడు. కాని అతని మనస్సులో భయం అట్లాగే పీడిస్తోంది. దీనికితోడు రాజమ్మగారింటికి పోయే దగ్గఱదాటి రాజేశ్వరంగారి ఇంటిమీదుగానే పోతుంది. ఆదారెంబడి నడుస్తూ ఈసంగతి అతనికి జ్ఞాపకం వచ్చేసరికి ఎక్కడలేని హడలూ ముంచుకువచ్చింది. దాంతో అతడు అడ్డమైన చుట్టుదార్లూ తిరిగి ఎట్లాగైతేనేం ఒకగంటసేపటికి రాజమ్మగారింటి దగ్గఱకు చేరాడు. అతడింతా కష్టపడి వాళ్లింటిదగ్గఱకు పోతే బైటితలుపు తాళం వేసివుంది. 'ఇదెక్కడి ఖర్మంరా భగవంతుడా' అనుకుంటూ ఇరుగువాళ్లనీ పొరుగువాళ్లనీ వాకబుచేస్తే ఎవర్ని అడిగినా మాకు తెలియదంటే మాకు తెలియదన్నారు. చివఱికి ప్రాణం విసిగి బందరెళ్లిపోదాం అనుకున్నాడు. అముక్క అనుకోడంతోటే ఈవిడ్ని కలుసుకోవడం విషయంలో తన భార్య ఎంత నొక్కి చెప్పిందీ జ్ఞాపకంవచ్చింది. ఇంతా చేసి ఈవిడ్ని కలుసుకోకుండా వెళ్లిపోతే ఆవిడమనస్సు చాలా నొచ్చుకుంటుంది. పైగా కోపంకూడా వస్తుందేమో! అయితేమాత్రం ఏం చేస్తాడూ? మర్నాడు బడి వుంది. రాత్రికి తప్పకుండా వెళ్లిపోవాలి. చిట్టచివఱి కారు సాయంత్రం ఆరుగంటలికి. అప్పటికప్పుడే మూడుకావస్తోంది. ఈ మూడుగంటలూ అక్కడే పడి కూర్చుంటే ఆవిడఆనుపాను లేమైనా తెలుస్తాయా అంటే ఆ ఆశకేమీ ఆస్కారం లేకుండా వుంది. చివరికేమైతే అదౌతుంది, బందరే వెళ్లిపోదామని తెగించుకుని, అంతగా అవసరమైతే అబద్ధమాడేద్దామని నిశ్చయించుకుని సరాసరి కార్లస్టాండుకు వెళ్లి, రాజేశ్వరం ఇక్కడకూడా కర్మంజాలక కనబడతాడేమో అన్న భయంతో వెంటనే బయలుదేఱే కార్లో ఎక్కి బందరు వెళ్లిపోయాడు.

## 3

నరసింహారావు కారు దిగి ఇంటివేపు నడుస్తున్నాడన్నమాటేగాని ఇంటికి వెళ్లడంతోటే భార్య అడిగే ప్రశ్నలకు సమాధానం ఏం చెప్పాలో తోచక మనసులో తన్నుకుంటూనే ఉన్నాడు. కారు వూళ్లోకి

ఏడుగంటలకే వచ్చినా సాధ్యమైనంత ఆలస్యంగా వెళ్లితే సమాధానం చెప్పే బాధ్యత తాత్కాలికంగా నైనా తగ్గుతుందనే ఆశతో కనపడ్డ ప్రతిస్నేహితుడితోనూ బాతాఖానీ వేశాడు. అట్లాగైనా ఒక గంట గడిచేటప్పటికి గండమైపోయింది. చివరికి కాఫీహోటల్లో కూర్చుంటే వాళ్లతోనూ వీళ్లతోనూ కబుర్లు చెపుతూ రేడియో వింటూంటే కాలం అలాగ్గా గడిచిపోతుందని ఆపనీ చేశాడు. ఇంతలో అతనికో ఆలోచన తట్టింది. ఇప్పు డెల్లాగూ తొమ్మిది కొట్టారుకదా! ఈ పాటికి తన భార్య అప్పుడే భోంచేసి వంటయిల్లు కడుక్కుంటూ ఉంటుంది. తానుగనక హోటల్లో భోజనం చేసి బయలుదేరితే ఇంటికి వెళ్లేటప్పటికి పదిదాటుతుంది. అప్పటి కావిడ తప్పకుండా ఒక నిద్ర తీస్తూ ఉంటుంది. ఆ సమయంలోగనక తాను పోయి తలుపు తట్టితే నిద్రమత్తులో వుంటుందికనక కొంచెం మాలస్యంగా తలుపు తీసినా బహుశా ప్రశ్నలేమీ వెయ్యకుండానే వదిలిపెడుతుంది. అంతగా వేసినా ఒకటి రెండుకంటె ఎక్కువ వెయ్యదు. వాటికేమో ఆఁ వూఁలతో సరిపెడితే రాత్రి గడిచిపోతుంది. రేపటిమాట రేపు చూసుకుందాం అనుకున్నాడు. ఈఉపాయం అతనికి తోచేటప్పటికే దేవుడు కనిపించి కోరిన వరాలన్నీ ఇచ్చినంత సంతోషం పొందాడు.

తాననుకున్న ప్రకారంగా హోటల్లో భోజనం చేసి ఇంటికి పోయేసరికి తలుపులు వేసిఉన్నాయ్. దీపాలు కనపడడం లేదు. తన అదృష్టం పండిందని భావిస్తూ చకచకా పోయి తలుపు తట్టాడు. అతని భార్య వంటయిల్లు కడుగుతూవున్న కారణంచేత ఈ తలుపుతట్టిన శబ్దం ఆవిడకు వినపడలేదు. నరసింహారావావిడ నిద్రపోతోందని అనుకుని ఇంకొంచెం గట్టిగా కొట్టాడు. దీని కావిడ 'ఎవరు వారు' అంటూ గట్టిగా కేకేసింది. ఆ కేక మేలుకున్నప్పుడు వచ్చే కంఠధ్వనిలాగా వినబడేటప్పటికి నరసింహారావు ధైర్యం తెచ్చుకుని ఎల్లాగైనా సమస్య నెదుర్కోవలసి ఉంటుం దనే జాగ్రత్తలో పడి 'నేనే! తలుపుతియ్' అన్నాడు. అతని గొంతు గుర్తుపట్టి ఆవిడ వంటింట్లోవి ఎక్కడివక్కడ వదిలేసి పరుగెత్తుకుంటూ వచ్చి దీపం పెద్దదిచేసి తలుపు తీసింది. తలుపు తీస్తూనే 'ఇంత ఆలస్యంగా వచ్చారేమిటండీ! కారేమన్నా చెడిపోయిందా' అని ప్రశ్న గూడా వేసింది.

భార్య వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పవలసి వచ్చేసరికి నరసింహారావు ఆలోచనాశక్తి బహువిధాల విజృంభించింది. వెళ్లిన పని కాకపోవడానికి అతని అశక్తత కారణం కాకపోయినా సానుకూలం కాలేదని స్పష్టంగా తేల్చిచెప్పడానికతనికి ధైర్యం చాలలేదు. అంచేత జరిగింది జరిగినట్టుగా చెపితే లోపమంతా అతనిదే నని తేల్చివెయ్యడమే కాకుండా మనస్సులో చాలా నొచ్చుకుంటుంది. ఇతర్లకు నొప్పి కలిగించడం అతన్ని మిక్కిలిగా బాధపెట్టే విషయం కాబట్టి ఆనాడావిడ వేసిన ప్రశ్నల కన్నింటికీ సమాధానాలుగా అబద్ధాలే ఆడవలసివచ్చింది.

భార్య తలుపు తీస్తూనే వేసిన ప్రశ్నకు సమాధానం చెప్పడానికి చేసే ప్రయత్నాల్లో బుజంమీది ఉత్తరీయం చేత్తో పుచ్చుకుని జాడించడం ఒకటి కాగా ముఖ మావిడకు కనపడకుండా తిప్పుకుని దూకుడుగా నడుస్తూ 'కారు చెడాలేదు, ఏమీ లేదు. మా పెత్తల్లి భోంచేసి మఱీ వెళ్లమని బలవంతపెడితే అట్లాగే నని చిట్టచివఱి కారులో వచ్చా' నంటూ చొక్కా ఊడదీసి వొంకెకు తగిలించివచ్చి పడకకుర్చీలో జేర్లబడ్డాడు. ఇంతలోకే ఆవిడ వంటయింటి తలుపులు వేసివచ్చి మంచినీళ్లు ఇమ్మంటారా అని అంటూ మఱచెంబులో నీళ్లు గ్లాసులో పోసి అందిస్తూ పక్కన కూర్చుంది. మంచినీళ్లు తాగి గ్లాసు కిందబెడుతూ 'అయితే మాణిక్యం! ఎన్నడూ లేందినువ్వివాళ ఇంతసేపటి వఱకూ మేలుకున్నావే' మన్నాడు వెటకారంగా నరసింహారావు.

'మీరు ఏమి అన్నా మఱీ చోద్యంగా అంటారండీ' అని యీసడించి, 'మీరు వస్తారని ఇంతవఱకూ కాచుకు కూర్చొని ఇప్పుడేగా భోంచేసింది? అట్లా భోంచేసి ఇట్లా పిల్లల్ని పడుకోపెట్టాను. ఇంతలో మీరొచ్చారు.' అని అంటూ దూరంగా ఉన్న దిండు దగ్గఱకు తీసుకుని ఆవిడ నడుం వాల్చింది. ఈసమయంలోనే తప్పకుండా మనే ఉద్దేశ్యంతో 'నాకూ నిద్ర

వస్తోంది, పక్కేశావా' అంటూ అతడు కుర్చీలోనుంచి లేవబోయాడు. 'అదేమిటండీ! వెళ్లిన సంగతేమైందో చెప్పకుండా పడుకుంటా నంటారూ' అంటూ ఆవిడ లేచి కూర్చుని, నిలబడిన అతని చెయ్యి పట్టుకుని కుర్చీలో కూర్చోబెట్టింది.

'నీ కేమో బద్ధకంగా ఉంది గదా అని పొద్దున్న చెప్పకోవచ్చు లే అనుకున్నాను.'

'మీరు చెపుతూవుంటే విందాం గదా అని నేను నడుం వాల్చాను. బాగానే ఉన్నది. అయితే మీరు వెళ్లడం వెళ్లడం మీ పెత్తల్లిగారింటికే వెళ్లారా, రాజమ్మగారింటికి వెళ్లారా?'

'మా పెత్తల్లిగారింటికే వెళ్లాను. వాళ్లింట్లో మా మరదలికి జబ్బు. అక్కడ వాడితో ఈప్రస్తావన చెయ్యడానికే వీలులేకపోయింది.'

'అయ్యో! సుబ్బులుకు జబ్బేమిటండీ?'

'ఉబ్బసపు దగ్గు. దానితో అది బాధపడుతోంది. వాళ్ల సూరీడుకు పెళ్లిచేయాలని తొందర పెడుతోందిట. మధ్య రాజేశ్వరం నలిగిపోతున్నాడు.'

'అతను మీకంటే నయమే! ఏమన్నా సంబంధం నిశ్చయంచేశాడా?'

'చెయ్యడానికే తంటాలుపడుతున్నాడు. అందుచేతే వాడా గొడవల్లో ఉంటే మన గొడవగూడా ఎందుకని వాడితో ఈ సంగతి చెప్పనేలేదు.'

'మఱయితే ఏం చేశారూ? అసలు సంబంధం మాట కనుక్కోకుండానే వచ్చేశారా ఏమిటి? మీరంతపనీ చేసేవారుమాత్రం అవును.'

'ఆఁ. అట్లా వదిలిపెట్టి వచ్చా ననుకున్నావా? దాని విషయం పూర్తిగా కనుక్కునే వచ్చాను.'

నరసింహారావు ఇంతవఱకూ ధైర్యంచేసి మాట్లాడుతున్నా డన్నమాటేగాని ముఖంలోమాత్రం వికాసం చూపలేకపోయాడు. మనస్సులో లేంది ముఖంలోమాత్రం చూపగలడు గనుకనా! ఈమాట అనేటప్పటికి అతని ముఖంలో కనబడాలిసినంత సంతృప్తి కనపడకపోవడంచేత ఆవిడ ఇతడేదో అబద్ధమాడుతున్నాడని అనుమానించింది. అతన్ని ఎట్లాగైనా బోల్తాకొట్టించాలన్న ఉద్దేశ్యంతో సునిశితంగా ప్రశ్నలు వెయ్యడం మొదలుపెట్టింది.

'అవును. మీ సామర్థ్యం నే నెఱగం దేముంది? అయితే రాజేశ్వరం లేకుండా మీ రొక్కరే వింజమూరి వారింటికి వెళ్లి కనుక్కున్నారా?'

'ఏమిటేవ్! అంత తీసెయ్యకు మఱి! బెజవాడలో నాస్నేహితులు లక్షమంది ఉన్నారు.'

'ఎంతమంది వుంటే ఏం ప్రయోజనం!'

'అంతేనా! ఒక స్నేహితుడు వాళ్లింట్లో పిల్లలకు ట్యూషను చెపుతున్నాడు.'

'ఆయ నేం చేస్తున్నదీ నాకెందుకూ? మీ రేం జేసివచ్చారో చెపుదురూ!'

'అదే చెప్తున్నా. అంత తొందఱపడితే ఎట్లా? వాళ్లబ్బాయినిగుఱించి వాణ్ణి అడిగాను'

'ఆయ నేమన్నాడేమిటి?'

'పిల్లవాడి కేం మంచివాడేకాని వాళ్లతో నువ్వేం తూగగలవురా అన్నాడు'

'ఎందుకనిట?'

'ఎందుకనేమిటి? పదిరోజులక్రిందట ఎవరో వచ్చి నాలుగువేలు కట్నమిస్తామంటే మాకు చాలదన్నారుట!'

'అబ్బో! అంత ఆశటండీ! రాజ్యలక్ష్మమ్మగారితో నిన్న ఈవిషయం మాట్లాడితే ఆవిడ అట్లా చెప్పలేదే! అయినా మీస్నేహితుడి కెవరన్నా కూతుళ్లున్నారేమో!'

'ఉంటే ఉండవచ్చుగాని వా డట్లా చెప్పేవాడు కాదు'

'ఈ నమ్మకాలతోటే మన మేపనీ చేసుకోలేకుండా ఉన్నాం. ప్రపంచంలో అంతా మనలాంటివాళ్లే అనుకుంటే ఎట్లా? ఆయన మిమ్మల్ని తప్పకుండా మోసగించా డనుకుంటాను'

'వా డట్లాంటివాడు కాదంటుంటే నమ్మవేమిటి?'

'ఆయన చెప్పాడని ఊరుకోకపోతే మీరే స్వయంగా వెళ్లి కనుక్కురాకపోయారూ?'

'బాగానే వుంది. అందాకా పోయి తత్వం తెలుసుకునికూడా వాళ్లచేత కాదనిపించుకోడం ఎందుకు?'

'సరే ఈ నామోషీలకేంగానీండి-మఱి ఆ సత్యనారాయణగారితో మాట్లాడారా?'

'ఆ. ఆయనతోనూ మాట్లాడాను. ఆఱునెల్లకిందట వాళ్ల అమ్మ చావుకు సిద్ధమైతే ఆవిడబలవంతం మీద ఎవ్వర్నీ పిలవకుండానే పెళ్లిచేశాడుట బావమఱదికూతుర్నిచ్చి'

'ఇంతకూ వెళ్లినవాళ్లం వెళ్లినట్టుగా వచ్చామన్నమాట. బాగుంది. మరి మారాజమ్మ పిన్నితో మాట్లాడివచ్చారా?'

'బలే బాగా అడిగావు! నువ్వు వట్టి వెఱ్ఱిదానివిగాని మా రాజమ్మత్తను చూడకుండా వస్తానుటే? ఇవ్వాళ మధ్యాహ్నం భోజనంకూడా వాళ్లింట్లోనే. అప్పటినుంచీ సాయంత్రం నాలిగింటిదాకా కూర్చుని అన్నివిషయాలూ మాట్లాడుకున్నాము. వింజమూరివారి సంబంధంవిషయం ఆవిడా అట్లాగే అంది. ఇంకెక్కడన్నా సంబంధాలు చెప్పవమ్మా అంటే వాకబు చేసి వారంపదిరోజుల్లో ఉత్తరంరాయిస్తానంది. సరేనని మా పెత్తల్లిగారింట్లో చెప్పిపోదాంగదా అని అక్కడకు వెళ్లితే వాళ్లింట్లో భోజనం చెయ్యమన్నారు. అక్కడ భోంచేసి చక్కా వచ్చాను.'

నరసింహారావు ఈమాట లంటూంటే ఆవిడకెక్కడలేని నవ్వూ వచ్చింది. ఆవిడమనస్సులో అతడిందాకటినుంచి చెప్పిన వన్నీ అబద్ధాలే అని నిశ్చయం చేసుకున్నది. అతనికి కనబడకుండా నవ్వుమాత్రం ఆపుకుని—

'చాలా కష్టపడ్డారు. మనం పుట్టిన వేళావిశేషం అదెంత గొప్పదోకాని ఏపని చెయ్యబోయినా యింతేకదా!' అని యీసడించి, లేచి నిలబడి పక్కదులుపుకుంటూ ఉండగానే నరసింహారావు—

'అట్లా అంటేనే నాకు వళ్లు మండిపోతుంది. నువ్వు చెప్పిన పనులన్నీ ఒక్కటన్నా మరిచిపోకుండా చేసివచ్చానుగదా! ఇంకా అట్లా అంటే ఎట్లా చెప్పు!' అని అన్నాడు.

దీని కావిడ 'ఏంచేస్తేనేం? మనకు కావలసింది కాలేదు. ఇవాళ్టికి చాలు కానీండి ఇహ పోయి పడుకోండి' అని అంటూ దుప్పటి తలపైదాకా లాక్కుని ఆవిడ నడుం వాల్చగానే నరసింహారావు 'వాకిటి తలుపు వేసివుందో లేదో చూశావా' అని అంటూ పడకగదిలోకి వెళ్లాడు. 'మీరు నిలబడే ఉన్నారుగా చూడ్దురూ' అని ఆవిడ అంటూఉండగానే వాకిటితలుపు చప్పుడయి ఎవరో గడియవేసి లోపలికి వచ్చారు. నరసింహారావు గదిలో మంచం మీద పడుకునే ఉన్నాడు. అతని భార్య దుప్పటిలో నుంచి ఆ వచ్చిన ఆవిణ్ణి చూస్తూనే ఉన్నది. ఇంతలోకే ఆవిడ గదిగుమ్మందగ్గఱకు వచ్చి కాళ్లు కడుక్కునేందుకు నీళ్లు తీసుకోబోయేసరికి నరసింహారావావిణ్ని దీపంవెలుగున గుర్తుపట్టి 'రాజమ్మత్తా! ఎప్పుడు రావడం? ఇంత అర్ధరాత్రివేళ ఎట్లా వచ్చావమ్మా' అని అనగానే 'నేనిప్పుడు రావడం ఏమిటిరా! నిన్ననే వచ్చాను. వెంకమ్మ పిన్నీవాళ్లు గరుడగర్వభంగం సినీమా అంటే వెళ్లి ఇప్పుడే వస్తున్నాను. నేను వూళ్లోకి వచ్చిన సంగతి మీఆవిడ నీతో చెప్పలేదూ? నువ్వు ఆఖరికారులో వచ్చావా' అని ఆవిడ అడిగింది. ఆవిడ అట్లా అడుగుతూ ఉండగానే నరసింహారావు భార్య లేచివచ్చి 'ఉండవమ్మా! ఆయన మీయింట్లో మధ్యాహ్నం భోజనం చేసి ఇప్పుడే వచ్చారు బెజవాడనుంచి' అని అంటూ ఫక్కున నవ్వింది.

రాజమ్మగారి కిదేమీ అర్థంకాక తెల్లబోయి చూస్తూ 'అదేమిటే అమ్మాయి! మా యింట్లో భోజనం చెయ్యడం ఏమిటే!' అని అనగానే నరసింహారావు ఏమనడానికీ తోచక 'ఏమిటో లే అత్తా! నాకు నిద్ర వస్తోంది పడుకోనియ్యండి' అంటూ కళ్లు మూసుకున్నాడు.